

విత్తనం.. ప్రధానం

వానాకాలం సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో సాగు పనులు ఊపందుకున్నాయి. 8లో▸



గోపాలమిత్రల గోస

చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గోపాలమిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



తవ్వి వదిలేశారు!

అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుని నోట్లో శని అనేలా మారింది అంగడిచిట్టంపల్లి–లాల్‌పహాడ్ బీటీ రోడ్డు పరిస్థితి. 9లో▸

మూడు నెలల పరేషన్

సర్వర్ బిజీ సమస్యతో సతమతం

- సెంట్రల్, స్టేట్ కోటాకు వేర్వేరుగా వేలిముద్రల సేకరణ
- ఒక్కో కార్డుకు ఆరుసార్లు బయోమెట్రిక్
- ఇబ్బంది పడుతున్న రేషన్ డీలర్లు, లబ్ధిదారులు

తెల్ల రేషన్ కార్డుదారులకు మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో డీలర్లు, లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సర్వర్ సమస్యలతో సతమతమయ్యారు. ఒక్కో కార్డుదారుడికి బియ్యం పంపిణీకి 30 నిమిషాల సమయం పడుతోందని వాపోయారు.



పోలేపల్లిలో బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

మొరాయించిన సాఫ్ట్‌వేర్

దుద్యాల్: కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు ఆదివారం ప్రారంభించిన మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమం ఇబ్బందుల నడుమ కొనసాగింది. మండల పరిధిలో 20 గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఇందుకు కొత్త సాఫ్ట్‌వేర్ వినియోగించడంతో ఇబ్బందులు తలెత్తాయని డీలర్లు, లబ్ధిదారులు వాపోతున్నారు. ఒక్కో రేషన్ కార్డుకు బియ్యం పంపిణీ చేసేందుకు దాదాపు ఆరు పర్యాయాలు బయోమెట్రిక్ తీసుకోవాల్సి వస్తోందని.. ఇందుకు 30 నిమిషాల సమయం పడుతోందని చెప్పారు. సెంట్రల్, స్టేట్ కోటాకు వేర్వేరుగా వేలిముద్రలు ఒక్కో నెలకు రెండు చొప్పున మూడు నెలలకు ఆరు సార్లు వేలిముద్రలు వేస్తేనే మూడు నెలల కోటా అందుతుందని వివరించారు. దీంతో వృద్ధులు మరింత ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు.

నిల్వలకు ఇబ్బందులు

రేషన్ డీలర్ల వద్ద ఒక నెల సరుకులు నిల్వ ఉంచేందుకు వీలుగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. మూడు నెలల సరుకులు నిల్వ చేయాలంటే స్థలం సరిపడా లేక అద్దె తీసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదనపు అద్దె ప్రభుత్వమే చెల్లించాలని డీలర్లు కోరుతున్నారు.

ప్రారంభం కాని సరఫరా

యాలాల: మూడు నెలల రేషన్ ముందే పంపిణీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆదివారం నుంచి సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేసింది. యాలాల మండలంలో మాత్రం మొదటి రోజున బియ్యం పంపిణీ చేయలేదు. మండల పరిధిలో మొత్తం 36 రేషన్ దుకాణాలు ఉండగా జూన్‌కు సంబంధించిన బియ్యం కోటా ముద్దాయిపేట, రేళ్ల గడ్డ తండాకు మాత్రమే స్టాక్ పాయింట్ నుంచి రేషన్ దుకాణానికి చేరింది. మిగిలిన రేషన్ షాపులకు బియ్యం సరఫరా జరగకపోవడంతో లబ్ధిదారులకు పంపిణీ ప్రారంభం కాలేదు. కాగా మూడు నెలల కోటాకు సంబంధించిన నిల్వ ఉంచుకునే ప్రదేశం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కోటాకు సంబంధించి ఈపాస్ మిషన్ నుంచి లబ్ధిదారుల వివరాల సేకరణకు చాలా సమయం పట్టే అవకాశం ఉందని డీలర్లు పేర్కొంటున్నారు.



కోకట్‌లో తెరుచుకోని రేషన్ షాపు

సాంకేతిక సాకుతో బ్రేక్

బషీరాబాద్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారింది పౌరసరఫరాల శాఖ పనితీరు. తెల్లరేషన్ కార్డు దారులకు మూడు నెలల రేషన్ బియ్యం ముందస్తుగా పంపిణీ చేసే కార్యక్రమం ఆదివారం నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు వారం ముందుగానే రేషన్ దుకాణాలు బియ్యం కోటా చేరింది. కాగా కొత్త సాఫ్ట్‌వేర్ కారణంగా సర్వర్ సతాయించడంతో బియ్యం పంపిణీకి బ్రేక్‌పడింది.

పంపిణీకి సిద్ధంగా 8,230 క్వింటాళ్లు

మండల పరిధిలో 11,925 రేషన్ కార్డుదారులకు గాను 36 షాపుల ద్వారా ప్రతీ నెలా బియ్యం పంపిణీ చేస్తున్నారు. మూడు నెలల కోటాకు సంబంధించి 8,230 క్వింటాళ్ల బియ్యం మండల పరిధిలోని రేషన్ దుకాణాలు చేరింది. కానీ ఆదివారం ఏ ఒక్క గ్రామంలోనూ పంపిణీ చేయలేదు. సాంకేతిక సమస్య కారణంగా మధ్యాహ్నం వరకు బియ్యం పంపిణీ చేయలేదు. మధ్యాహ్నం తర్వాత సమస్య పరిష్కారం అయినప్పటికీ ఎక్కడ పంపిణీ జరగలేదని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. నేటి నుంచి ఈ నెలాఖరువరకు పంపిణీ జరుగుతుందని.. వినియోగదారులు ఆందోళన చెందొద్దని అధికారులు సూచించారు.



కొడంగల్ రేషన్ దుకాణంలో వేలిముద్రలు తీసుకుంటున్న డీలర్

కొడంగల్‌లో షురూ..

కొడంగల్: ప్రభుత్వం మూడు నెలలకు సంబంధించి బియ్యం పంపిణీ చేయడంతో తెల్లరేషన్‌కార్డుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్‌లో ఆదివారం మూడు నెలల బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఆదివారం ఉదయం కాసేపు సర్వర్ మొరాయించినా సాయంత్రం వరకు పనిచేసిందని రేషన్ డీలర్లు తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ చేస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పరిగి: కేసు వివరాలు వెల్లడిస్తున్న పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి

అనుమతులకు మించి తవ్వకాలు

- జెడ్పీటీసీ మాజీ సభ్యుడిపై కేసు
- ఆరుగురికి రిమాండ్
- వివరాలు వెల్లడించిన పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి

పరిగి/దోమ: అనుమతులకు మించి అక్రమ మైనింగ్ తవ్వకాలు జరిపిన సాయి కృష్ణ స్టోన్ క్రషర్స్‌పై మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు శనివారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పలువురిపై కేసు నమోదు చేసిన పోలీసులు క్రషర్‌లో పనిచేస్తున్న ఆరుగురిని రిమాండ్‌కు తరలించారు. పరిగి సీఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన ప్రకారం.. దోమ మండలం దిర్సంపల్లి శివారులో సర్వే నంబర్ 173లో దోమ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, కిష్టాపూర్‌కు చెందిన నాగిరెడ్డి పది ఎకరాలకు లీజు తీసుకుని మైనింగ్ నిర్వహిస్తున్నాడు. అనుమతులకు మించి తవ్వకాలు చేపట్టినట్లు ఫిర్యాదులు అందడంతో మే 21న సర్వే చేసిన అధికారులు 1.1 ఎకరాల్లో అదనంగా తవ్వకాలు జరిపి రూ.2కోట్ల వరకు ఆర్జించినట్లు గుర్తించారు. మే 31న తాండూర్ అసిస్టెంట్ డైరెక్టర్ మైన్స్ అధికారి సత్యనారాయణ, దోమ డిప్యూటీ తహసీల్దార్ పోలీసు సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆందోళన చెందిన క్రషర్ నిర్వాహకుడు రాత్రికి రాత్రే తవ్వకాలు జరిపిన చోట పూడ్చేందుకు యత్నించాడు. ఈ క్రమంలో మూడు హిటాచీలు, ఓ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. డిప్యూటీ తహసీల్దార్ ఫిర్యాదు మేరకు క్రషర్ యజమాని కొప్పుల నాగిరెడ్డి, ఇతరులపై కేసు నమోదు చేశారు. క్వారీలో పనిచేస్తున్న శ్రీశైలం, సుజిత్‌కుమార్ మెహతా, ఎండీ ఆజాద్, ప్రకాశ్‌కుమార్, సురేశ్‌సింగ్, రామకృష్ణను రిమాండ్‌కు తరలించామన్నారు. నాగిరెడ్డితో పాటు పలువురు పరారీలో ఉన్నారని వారి జాడకోసం ప్రత్యేక టీం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో దోమ ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దోమ: పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

జిల్లా పోలీసులకు సేవా పతకాలు

అనంతగిరి: ప్రభుత్వం ప్రకటించిన పోలీసు పతకాలలో జిల్లాకు చెందిన ఐదుగురు పోలీసులకు పోలీసు సేవా పతకాలు వరించాయి. సీసీఎస్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఎ.రమేశ్, ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్‌ఎస్‌ఐలు ఎంఏ. రషీద్, బిచ్చప్ప, సీసీఎస్ ఏఎస్‌ఐ వి.లక్ష్మణ్, కంట్రోల్ రూంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ టి.రాజు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అధికారులు, సహచర పోలీసులు వారిని ప్రశంసించారు.

న్యూస్‌రీల్

నేడు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

జెండా ఆవిష్కరించనున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



కలెక్టరేట్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో ఉదయం 10గంటలకు శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు అధికారులు చేపడుతున్న ఏర్పాట్లను ఆదివారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ పర్యవేక్షించారు. 10.05గంటలకు పోలీసు గౌరవ వందనం స్వీకరణ, 10.10గంటలకు స్పీకర్ సందేశం, 10.25గంటలకు అమరవీరుల కుటుంబాలకు సన్మానం, 10.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 11 గంటలకు గ్రామ పాలన అధికారుల నియామక ఉత్తర్వులు అందజేత, 11.10 గంటలకు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాల అందజేత, 11.20గంటలకు జాతీయ గీతంతో కార్యక్రమం ముగుస్తుందని చెప్పారు.

నేటి ప్రజావాణి రద్దు

అనంతగిరి: తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాల నేపథ్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వాసులు విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

‘డబుల్’ ఇళ్లు ఇవ్వండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్



సమావేశంలో మున్సిపల్ కార్మికులు

అనంతగిరి: మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిగా పని చేస్తున్న తమకు డబుల్ బెడ్రూం లేదా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఉదయం మున్సిపల్ కార్మికులతో సమావేశమై మాట్లాడారు. మధ్యలో నిలిచిన డబుల్ బెడ్రూం ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, బుచ్చయ్య, రాములు, లక్ష్మి, నర్సింలు, దశరథ, అనంతమ్మ, జ్యోతి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

- రూ.7.50 లక్షల విలువ చేసే 300 కిలోల నిషేధిత విత్తనాలు స్వాధీనం
- ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు



నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న, కొనుగోలు చేస్తున్న వారిని అరెస్టు చేసిన పోలీసులు

షాద్‌నగర్: గుట్టు చప్పుడు కాకుండా నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న, కొనుగోలు చేసిన వారిని పోలీసులు పట్టుకొన్న సంఘటన షాద్‌నగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లా చంద్రలపాడుకు చెందిన జంపాని నాగేశ్వర్ రావు కొంతకాలంగా వికారాబాద్ జిల్లా ద్యాచర్లలో రైతుల వద్ద కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పల్నాడు జిల్లా అమరావతి మండలానికి చెందిన వీర వసంతరావు ద్వారా నకిలీ పత్తి విత్తనాలు తెప్పిస్తున్నాడు. మేలైన విత్తనాలు అని నమ్మించి చుట్టు పక్కల ఉండే రైతులకు విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి షాద్‌నగర్‌లో విక్రయించేందుకు ప్రయత్నించారు. పట్టణ శివారులోని బక్కర్మన్ గార్డెన్ ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో నిషేధిత పత్తి విత్తనాలను కారులో తీసుకొచ్చి ముగ్గురు రైతులకు విక్రయించేందుకు ప్రయత్నించారు. పక్కా సమాచారం అందుకున్న షాద్‌నగర్ వ్యవసాయ అధికారులు, ఎస్‌ఓటీ, షాద్‌నగర్ పోలీసులు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న, కొనుగోలు చేస్తున్న వారిని పట్టుకొన్నారు. వారి నుంచి రూ.7.5లక్షల విలువ చేసే 300కిలోల నకిలీ విత్తనాలను, కారును స్వాధీనం చేసుకున్నారు. నాగేశ్వర్‌రావు, వీర వసంతరావుతోపాటు వికారాబాద్ జిల్లా ఐయాన్‌పూర్‌కు చెందిన రైతు గంగారపు పొండు, దాచారం గ్రామానికి చెందిన టెక్నో సీడ్స్ కంపెనీ సేల్స్ ఎగ్జిక్యూటివ్ చాకలి రాములు, ఐనాపూర్‌కు చెందిన రైతు నెమలి రవిని అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో షాద్‌నగర్ ఇన్‌చార్జి ఏడీఏ నిషాంత్‌కుమార్, ఏఈఓ తేజ్‌కుమార్, ఎస్‌ఐ శరత్‌కుమార్, మేడ్చల్ ఎస్‌ఓటీ ఎస్‌ఐ ధనుంజయ పాల్గొన్నారు.

ఆధునికీకరణ పనులు వేగవంతం చేయండి

సికింద్రాబాద్ డివిజన్ డీఆర్‌ఎం భరత్ కుమార్ జైన్

తాండూరు టౌన్: తాండూరు రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని సికింద్రాబాద్ డివిజన్ డీఆర్‌ఎం భరత్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన తాండూరు రైల్వే స్టేషన్‌లో ఎస్కలేటర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, వెయిటింగ్ హాల్, టికెట్ కౌంటర్, ప్లాట్‌ఫాం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ జైన్ మాట్లాడుతూ.. అమృత్ భారత్ పథకం కింద రైల్వే స్టేషన్ల ఆధునీకరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తాండూరు రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.24 కోట్లు మంజూరు చేసిందన్నారు. అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, త్వరలోనే పూర్తి స్థాయిలో స్టేషన్ ఆధునికీకరణ పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయనతో వెంట సికింద్రాబాద్ డివిజన్ అధికారులు ఉన్నారు.

బీటీ రోడ్డుకు బ్రేక్!

- నిలిచిన అడాల్‌పూర్ రోడ్డు నిర్మాణం
- అటవీశాఖ పరిధిలోకి వస్తుందని అడ్డుకున్న అధికారులు
- ప్రభుత్వ అనుమతి తీసుకున్నాకే పనులు చేపట్టాలని సూచన
- ఆందోళనలో గ్రామస్తులు



అడాల్‌పూర్ మార్గంలో నిలిచిన పనులు

యాలాల: మండల పరిధిలోని అడాల్‌పూర్ గ్రామానికి వేస్తున్న బీటీ రోడ్డు పనులకు బ్రేక్ పడింది. ప్రస్తుతం ఉన్న మెటల్ రోడ్డు మార్గం అటవీశాఖ పరిధిలోని వస్తోందంటూ ఆ శాఖ అధికారులు పనులను అడ్డుకోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.


రూ.2.30 కోట్ల నిధులు మంజూరు

అడాల్‌పూర్‌కు వెళ్లేందుకు తాండూరు మండలం బిజ్వార్ శివారు నుంచి రాకపోకలకు ఉన్న మార్గంలో దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం మీదుగా ఉంది. ఈ క్రమంలో 2012లో మెటల్ రోడ్డు నిర్మించారు. ప్రతీ ఏడాది వర్షాకాలంలో ఈ మార్గం మీదుగా వెళ్లేందుకు గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో పంచాయతీ రాజ్ శాఖ నుంచి 3.25 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి గాను రూ.2.30 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఇదే మార్గంలో ఐదు చోట్ల కల్వర్టులున్నాయి. ఇటీవల కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడంతో సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు సిబ్బందితో కలిసి వచ్చి పనులు నిలిపివేయించారు. దీంతో గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి సమస్య వివరించి పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలని సూచించాం

బిజ్వారం శివారు నుంచి అడాల్‌పూర్ వరకు వేస్తున్న రోడ్డు అటవీ శాఖ పరిధిలోకి వస్తుంది. దీంతో 1.67 కిలోమీటర్ల భూభాగం కోల్పోతున్నాం. ప్రభుత్వ అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని నాలుగు నెలల క్రితమే గ్రామస్తులకు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు సూచించినా వారు పట్టించుకోలేదు. ఇప్పటికే అడాల్‌పూర్ నుంచి షేక్‌పీర్ల గుట్ట మీదుగా కమాల్‌పూర్ వరకు ఉన్న రోడ్డు సైతం అటవీశాఖ పరిధిలోనిదే. ఈ విషయంలో గ్రామస్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి అనుమతి కోరుతూ నివేదిస్తే రెండు నెలల్లో అనుమతులు వచ్చే అవకాశం ఉంది. అనుమతులు వచ్చాక బీటీ రోడ్డు పనులు చేపట్టవచ్చు.

– రాజేందర్, ఫారెస్టు రేంజ్ అధికారి



కేరెళ్లిలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

బాల వికాసం

కేరెళ్లి సత్యసాయి సార్వజనిక కేంద్రంలో నిర్వహించిన వేసవి శిబిరంలో విద్యార్థులకు తెలుగు చదవడం, రాయడం, గణితం, సంగీతం, యోగా ధ్యాన మూలలపై శిక్షణ ఇచ్చారు. ఆదివారం శిక్షణ ముగింపు ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు నేర్చుకున్న అంశాలను ప్రదర్శించారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల సమన్వయ కర్త హరినాథ్‌రెడ్డి చిన్నారులను అభినందించారు. సేవా సమితి బాధ్యులు తదితరులు పాల్గొన్నారు. – ధారూరు

ఉపాధికి ఊతం

- పాడి పరిశ్రమకు రుణాలు
- ఔత్సాహికులకు కేంద్రం ప్రోత్సాహం
- సెంట్రల్ లైవ్‌స్టాక్ స్కీమ్ కింద సబ్సిడీ
- అవగాహన లేక ఆదరణ కరువు

కేశంపేట: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంతో పాటు మాంసం ఉత్పత్తులను పెంచే లక్ష్యంతో కేంద్ర పశు సంవర్ధకశాఖ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్‌ఎల్‌ఎం) పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పశువుల ఉత్పాదకతను పెంచడంతో పాటు పశువులకు మేత, దాణా పరిశ్రమలను ప్రోత్సహిస్తోంది. ఈ మేరకు ఔత్సాహికులకు సబ్సిడీ అందిస్తోంది. సబ్సిడీ పొందిన వారు ఐదేళ్ల వరకు కొనసాగించాల్సి ఉంటుంది. లేదంటే ఇచ్చిన నిధులను అధికారులు రికవరీ చేస్తారు.

దరఖాస్తు చేసుకోండి ఇలా..

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంలో గొర్రెలు, మేకలు, నాటుకోళ్లు, పందుల పెంపకం కోసం 18 ఏళ్లు పైబడిన వారు వ్యక్తిగతంగా లేదా సామూహికంగా దరఖాస్తు చేసుకోవచ్చు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలు వారు లబ్ధి పొందేందుకు అవకాశం ఉంది. www.nlm.udyamimitra.in ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

కావాల్సిన పత్రాలు

ఆధార్‌కార్డు, చిరునామా ధ్రువీకరణ (ఓటర్‌ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాసుబుక్), కులధ్రువీకరణ, భూమి పట్టాదారు పాసుపుస్తకం, విద్యార్హత పత్రాలు, పాన్‌కార్డు, ఆదాయ ధ్రువపత్రం, పాస్ పోర్టు సైజ్‌ఫొటో, ప్రాజెక్టు ఏరియా ఫొటో, ఆరు నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్, బ్యాంక్ మ్యాండెట్‌ఫాం, క్యాన్సిల్ చెక్కు, వెటర్నరీ డాక్టర్ చేత ధ్రువీకరించిన అనుభవం సర్టిఫికెట్, సీఏ చేత ధ్రువీకరించిన డిటైయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు.. ఇలా 13 రకాల పత్రాలను దరఖాస్తుతో పాటు జతచేయాల్సి ఉంటుంది.



షెడ్‌లో ఉన్న గొర్రెలు

అవగాహన లేక..

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకానికి కేంద్రం 2021–22 సంవత్సరంలో శ్రీకారం చుట్టింది. పథకంలో భాగంగా సబ్సిడీ కింద రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు అందిస్తారు. జిల్లా వ్యాప్తంగా 158 దరఖాస్తులు వచ్చాయి. అవగాహన లేకపోవడం, పథకం పూర్తి సమాచారం తెలియక చాలా మంది ముందుకు రావడం లేదు.

రెండు స్థాయిల్లో ఆమోదం

జిల్లా స్థాయిలో వచ్చిన దరఖాస్తులు రాష్ట్ర, దేశ స్థాయిలో ఆమోదం పొందాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో డైరెక్టర్ స్థాయి అధికారితో కూడిన స్టేట్ లెవల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ, దేశ స్థాయిలో సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీలు ఉంటాయి. జిల్లా స్థాయిలో వచ్చిన 158 దరఖాస్తులను రాష్ట్ర స్థాయి కమిటీకి పంపించారు. అక్కడ కమిటీ సభ్యులు 56 మాత్రమే ఆమోదించారు. స్టేట్ లెవల్ కమిటీ ఆమోదించిన దరఖాస్తులకు బ్యాంకులు రుణాలు మంజూరు (లెంటర్ అప్రూవల్) చేయాల్సి ఉంటుంది. బ్యాంకులు 56 దరఖాస్తుల్లో 30కి మాత్రమే రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. వీటిని సెంట్రల్ లెవల్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి పంపించారు. అక్కడి అధికారులు పరిశీలించి 25 దరఖాస్తులకు ఆమోద ముద్ర వేశారు. ఆమోదం పొందిన దరఖాస్తుల్లో 22 మందికి మొదటి విడతగా సబ్సిడీ అందించారు. మరో ముగ్గురికి రావాల్సి ఉంది.

అవగాహన కల్పించాలి



అవగాహన లేకపోవడంతో చాలా మంది దరఖాస్తు చేయడానికి ముందుకు రావడం లేదు. ఈ పథకంలో ఉండే ప్రయోజనాల గురించి అధికారులు అవగాహన కల్పిస్తే ఉపయోగపడుతుంది.

– తలసాని వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కేశంపేట

దళారులను నమ్మొద్దు



ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎవరైనా లోన్ మంజూరు చేయిస్తాం, సబ్సిడీ ఇప్పిస్తామంటే నమ్మొద్దు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ బాబుబేరి, జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి

క్లుప్తంగా

సంచిని పడేసి.. పుస్తెలతాడుని తెంచేసి

వృద్ధురాలి మెడలో మంగళసూత్రం అపహరణ



బాధితురాలు లక్ష్మమ్మ

ఇబ్రహీంపట్నం: కూరగాయల కోసమొచ్చిన వృద్ధురాలి మెడలోని బంగారు మంగళసూత్రాన్ని ఓ దుండగుడు అపహరించుకొని పరారైన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మంచాల మండలం నోముల గ్రామానికి చెందిన లక్ష్మమ్మ(65) ఇబ్రహీంపట్నంలోని మార్కెట్‌కు ఆదివారం ఉదయం వచ్చింది. అక్కడ కూరగాయలు తీసుకొని తలపై పెట్టుకొని వెళుతుంది. ముఖానికి మంకి క్యాప్ ధరించిన దుండగుడు నడుచుకుంటూ వచ్చి ఆమె తలపై సంచిని కిందపడేసి మెడలోని నాలుగు తులాల బంగారు మంగళసూత్రాన్ని తెంచుకొని పరారయ్యాడు. దీంతో వృద్ధురాలు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించింది. స్థానిక ఏసీపీ కేపీవీ రాజు, సీఐ జగదీశ్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

మహిళ అదృశ్యం

యాచారం: కూలీ పనికంటూ ఇంటి నుంచి వెళ్లిన మహిళ తిరిగి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన దండుగుల శేఖర్ భార్య మమత(29) గత నెల 30న ఉదయం 7 గంటలకు కూలీకి పోతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. రెండు రోజులైనా తిరిగి రాకపోవడం, ఆమె ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ ఉంది. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గ్రామాల్లోని బంధువుల ఇళ్లల్లో వెతికినా జాడ లేదు. ఆదివారం మమత భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్

ఒకరి దుర్మరణం



కృష్ణయ్య మృతదేహం

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆమనగల్లు పట్టణ సమీపంలో చోటు చేసుకుంది. ముర్తుజపల్లి గేటు వద్ద హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై బైక్‌ను ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం .. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి గ్రామానికి చెందిన రాయకుంట కృష్ణయ్య(35), ఆయన బంధువు శేఖర్ పని నిమిత్తం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వీరు ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై సొంతూరికి బయలుదేరారు. మార్గమధ్యలో పట్టణ సమీపంలోని ముర్తుజపల్లి గేటు వద్ద అతివేగంగా వచ్చిన ఓ ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణయ్య అక్కడికక్కడే మృతిచెందగా, శేఖర్ తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో మునిగిన యువతి!



రేష్మా (ఫైల్)

ఇబ్రహీంపట్నం: చెరువులోకి దిగిన యువతి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. నగరంలోని ఫలక్‌నుమాకు చెందిన రేష్మా(24) బాలాపూర్‌కు చెందిన ఆమె స్నేహితుడు ఖాసీంతో కలిసి ఇబ్రహీంపట్నం చెరువు వద్దకు ఆటోలో వచ్చినట్లు తెలిసింది. ఖాసీం ఈత కొడుతుండగా రేష్మా కూడా చెరువులోకి దిగినట్లు సమాచారం. ఏమైయిందో ఏమోగాని ఆకస్మాత్తుగా యువతి చెరువు నీటిలో మునిగిపోయింది. చీకటి పడటంతో ఆమె ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టలేదు. ఈ సంఘటన సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కంటోన్మెంట్ బోర్డులో ఉద్యోగాల పేరుతో టోకరా

నిందితుడి అరెస్టు

రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్ బోర్డులో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడిన కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బోయిన్‌పల్లి బాపూజీనగర్‌కు చెందిన శ్రవణ్‌కుమార్ అమాయకులను ఎంచుకుని కంటోన్మెంట్ బోర్డులో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడుతున్నాడు. 2009 నుంచి 2024 వరకు బేగంపేట, తిరుమలగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో 6 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. శ్రీలేఖ అనే మహిళ నుంచి రూ.22వేలు తీసుకుని ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశాడు. పవన్ అనే వ్యక్తి నుంచి రూ.35వేలు, విశాల్ అనే వ్యక్తి నుంచి రూ.20వేలు, మరో వ్యక్తి నుంచి రూ.35వేలు, వేములవాడకు చెందిన కృష్ణ అనే వ్యక్తి నుంచి రూ.50వేలు తీసుకుని కంటోన్మెంట్ బోర్డులో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు డిఫెన్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడు. గత కొన్నాళ్లుగా తప్పించుకు తిరుగుతున్న అతడిని ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి తిరుమలగిరి పోలీసులు అప్పగించారు.

విత్తనం.. ప్రధానం



నవాబుపేటలో విక్రయానికి సిద్ధంగా విత్తనాలు, ఎరువులు

- నాణ్యమైన వాటితోనే అధిక దిగుబడులు
- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు
- నకిలీ అమ్మితే చర్యలు తప్పవు
- మండల వ్యవసాయాధికారి జ్యోతి



నవాబుపేట: వానాకాలం సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో మండలంలో పలు గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ సమయంలోనే విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఏ మాత్రం అశ్రద్ధ వహించినా నకిలీ, నాసిరకం రూపంలో ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. మండలంలో ఖరీఫ్‌లో 27,234 ఎకరాల్లో పత్తి, కంది, మొక్కజొన్న, పెసర, సోయాబీన్, కూరగాయలు, ఆకుకూరలు సాగయ్యే అవకాశం ఉందని అంచనా. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి జ్యోతి ప్రకటించారు. అలాగే ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

కల్తీతో ప్రమాదం

ఏ పంటలోనైనా ఆయా వంగడాలు పూర్తి ఉత్పాదన సామర్థ్యాన్ని పొందాలంటే నాణ్యమైన విత్తనాలతోనే సాధ్యమవుతుంది. జన్యు స్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత కలిగిన విత్తనం వాడి మంచి సేద్య పద్ధతులను పాటించినప్పుడు మాత్రమే అది వీలవుతుంది. అందువల్ల అధిక దిగుబడులకు నాణ్యమైన విత్తనం కీలకమైన పెట్టుబడి, దీంతో పంట దిగుబడి పెరగడమే కాకుండా, పైరు ఎదుగుదల సమంగా ఉండి కల్తీలు లేకుండా గింజ నాణ్యత కలిగి ఉంటుంది. ఈ దశలో నకిలీల బెడదను పసిగట్టడం ముఖ్యం.

పాటించాల్సిన జాగ్రత్తలు

- విత్తనాలు కొనే ముందు కొనుగోలు చేయాల్సిన రకం సాగు చేయదలిచిన ప్రాంతానికి, సీజన్‌కు అనుకూలమా లేదా అనే విషయాన్ని గమనించాలి. ప్రైవేటు కంపెనీలు తయారు చేసిన విత్తనాలను కొనే ముందు ఆయా రకాలను వ్యవసాయ విశ్వ విద్యాలయంగానీ, వ్యవసాయశాఖ గానీ సాగు చేసి పరిశీలించి సిఫార్సు చేశారా లేక ఆ ప్రాంతవాసులు సాగు చేసి ధ్రువీకరించారా అనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలి.
- ధ్రువీకరించిన మేలు రకపు విత్తనాలను ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థ నుంచిగానీ, వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి గానీ వ్యవసాయ శాఖ వారిచే గుర్తింపు పొందిన లైసెన్సు, గత డీలర్ల నుంచి గానీ కొనుగోలు చేయాలి.
- విత్తనోత్పత్తి సంస్థలు బ్రీడర్ విత్తనాన్ని ఫౌండేషన్ విత్తనం గాను తర్వాత ధ్రువీకరణ పొందిన సర్టిఫైడ్ విత్తనంగాను రైతులకు అమ్ముతారు. గుర్తింపు పొందిన సంస్థల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తనంతో పాటు వివరాలతో కూడిన చీటి, కంపెనీ బిల్లు తీసుకోవాలి. విత్తిన తర్వాత ఖాళీ సంచిని, రసీదులను దాచి ఉంచాలి. కల్తీలు లేదా మొలక శాతం తక్కువ ఉన్నట్లు రుజువైతే ఈ ఆధారాలతో నష్టపరిహారం పొందడానికి వీలుంటుంది.
- హైబ్రీడ్ రకాలు సాగు చేసినప్పుడు ఆ పంట నుంచి వచ్చిన విత్తనం వాడకూడదు. హైబ్రీడ్ పంట నుంచి వచ్చే విత్తనాన్ని ఎఫ్–2 విత్తనం అంటారు. ఇది వాడితే దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. ఈ విషయాలను తప్పక రైతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



జుంటుపల్లిలో ధాన్యం కొనుగోలును తనిఖీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాలాల: మండలంలోని జుంటుపల్లి వరి కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు ఇటీవల బీఆర్ఎస్ నాయకులు పేర్కొనడాన్ని ఆయన ఖండించారు. ఈ విషయమై ఆదివారం కాంగ్రెస్ నాయకులు కేంద్రం వద్ద కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటివరకు రైతులకు ముందస్తుగా 60 వేల గన్నీ బ్యాగులు అందించారన్నారు. తేమ శాతం ఉన్న 38 వేల బ్యాగుల వరి ధాన్యాన్ని తూకం వేసి మిల్లులకు తరలించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌కుమార్, ఆశప్ప, ఆంజనేయులు, శాంతుకుమార్, రాంచందర్, ఎల్లప్ప పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలు



విద్యార్థులను సన్మానిస్తున్న వీరశైవ సంఘం నాయకులు

జగజ్యోతి బసవేశ్వర విద్యా సంస్థ అధ్యక్షుడు బస్వరాజు

అనంతగిరి: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని జగజ్యోతి బసవేశ్వర విద్యా సంస్థ అధ్యక్షుడు నూలి బస్వరాజు అన్నారు. ఈ మేరకు ఆదివారం వికారాబాద్‌లో వీరశైవ యువదళ్ ఆధ్వర్యంలో ఇటీవల 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వీరశైవ జంగమ, లింగాయత్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో చదువుతోనే అన్ని సాధ్యమన్నారు. పోటీ ప్రపంచంలో టాప్ స్థాయిలో రాణిస్తేనే అవకాశాలు వస్తున్నాయన్నారు. విద్యార్థులు కష్టపడి 500 పైగా మార్కులు సాధించడం గొప్ప విషయమన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించేవరకు విశ్రమించవద్దన్నారు. కష్టపడి చదివితే విజయం తప్పక వరిస్తుందన్నారు. విద్యార్థులకు తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మంచి స్థాయిలో స్థిరపడి తల్లిదండ్రులకు, ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, వీరశైవ సమాజం అధ్యక్షుడు అప్ప విజయ్‌కుమార్, కార్యదర్శి విద్యాసాగర్, బిచ్చప్ప, వీరకాంతం, విశ్వంపంతులు, యువదళ్ అధ్యక్షుడు కోటిలింగం, సభ్యులు వసంత్, అమర్, భాను, సుధీర్‌పటేల్, రాజేష్, బసవేశ్వర్, శంకర్, సంతోష్, ధనొట్టి తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య భరోసా ఇచ్చారు. ఆదివారం మండల పరిధిలోని గంగ్యాడలో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మాది పేదల ప్రభుత్వం ఏ ఒక్క పేదవాడికి అన్యాయం జరగదన్నారు. విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. మొదటి విడతలో ఇల్లు మంజూరైన వారు తక్షణమే నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసుకోవాలన్నారు. నిర్మాణ దశలను బట్టి బిల్లులు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందమ్మ, నాయకులు మల్లేశం, రామచంద్రారెడ్డి, దాసుగౌడ్, కిష్టయ్య, మాణిక్యం, జంగయ్య, విట్టల్, నర్సింలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానానికి ముందుకు రావాలి

కేశంపేట: సమాజంలో ప్రతిఒక్కరూ అవయవదానం చేసేందుకు ముందుకు రావాలని ఆల్ ఇండియా ఆర్గాన్ అండ్ బాడీ డోనర్స్ అసోసియేషన్ నేషనల్ కో ఆర్డినేటర్ సొంటే శ్రీనివాస్ కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఉన్న మై హోమ్ జెవెల్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాంగణంలో అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గుడూరు సీతామహాలక్ష్మి, ఎమ్మెల్యే అరికపూడి గాంధీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ అవయవాలను దానం చేస్తున్నట్టు అంగీకారపత్రాన్ని గాంధీ మెడికల్ ప్రిన్సిపాల్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలను వదిలిపెట్టి మానవత దృక్పథంతో అవయవదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. మరణించిన తర్వాత శరీరాన్ని పూడ్చిపెట్టడం, కాల్చి వేయడంతో ఎలాంటి ఉపయోగం లేదన్నారు. అందుకే అందరూ మరణాంతరం అవయవదానానికి ముందుకు రావాలని సూచించారు.



అవయవదాన అంగీకారపత్రం అందిస్తున్న శ్రీనివాస్

యూట్యూబ్ చానల్‌పై ఫిర్యాదు

రాజేంద్రనగర్: తమ ప్రతిష్టకు భంగం కలిగేలా వార్తలు ప్రసారం చేసినందుకు రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ మహ్మద్ ఫయీం ఖురేషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం రాజేంద్రనగర్ పోలీసులు ఓ యూ ట్యూబ్ నిర్వాహకుడితో పాటు మరో వ్యక్తిని స్టేషన్‌కు రప్పించారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో ఇంగ్లాండ్ దేశానికి చెందిన కంటెస్టెడ్ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ మహ్మద్ ఫయీం ఖురేషితో పాటు రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ఫొటోలతో పాటు వారి పేర్లను పేర్కొంటూ వార్త ప్రచురించారు. ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయమై ఫయీం ఖురేషి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆదివారం ఉప్పల్‌కు చెందిన గౌతం గౌడ్‌తో పాటు టోలిచౌకి ప్రాంతానికి చెందిన ఓ యూ ట్యూబ్ చానల్ నిర్వాహకుడు వసీంలను స్టేషన్‌కు పిలిపించారు. వారిని విచారించి 35(3) సీఆర్‌పీ ప్రకారం నోటీసులు అందజేశారు. మూడు రోజుల తర్వాత మరోమారు స్టేషన్‌లో హాజరు కావాలని సూచించారు. వసీం తన వద్దకు వచ్చిన వార్త క్లిప్పింగ్‌ను ఎలాంటి విచారణ లేకుండా పోస్టు చేశానని.. దీంతో ఫయీం ఖురేషితో పాటు రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ వ్యక్తిగతంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారిని క్షమాపణలు కోరుతున్నట్లు తెలిపాడు. గౌతం గౌడ్ తెలుగు స్ట్రైక్ పత్రికకు తనకు ఎలాంటి సంబంధం లేదని... గతంలోనూ ఇదే విషయాన్ని గచ్చిబౌలి పోలీసులకు చెప్పినట్లు తెలిపాడు. సదరు పత్రిక ఓ పార్టీ నేతలు నడిపిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు ఎప్పుడు కోరితే అప్పుడు తాను హాజరవుతానని వెల్లడించారు.

‘జయ గ్రూప్స్’పై చర్యలు తీసుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

- ప్రీ లాంచింగ్ ఆఫర్ల పేరుతో నిండా ముంచారు
- రూ.300 కోట్లకు పైగా వసూలు
- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు

పంజగుట్ట: తమ వద్ద ప్రీ లాంచింగ్ ఆఫర్‌లో ప్లాట్లు తీసుకుంటే తక్కువ ధరకు ఇస్తామంటూ అందంగా బ్రోచర్లు ముద్రించి వందలాది మంది నుంచి దాదాపు రూ.300 కోట్లకు పైగా వసూలు చేసి మోసం చేసిన జయత్రి రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ (జయ గ్రూప్స్) సంస్థ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు వర్మ కుమార్, మూర్తి శ్రీనివాస్, ప్రసాద్ శివపురం, గణేష్, ఫణిలు మాట్లాడుతూ .. కాకర్ల శ్రీనివాస్ అనే వ్యక్తి మరో 19 మంది డైరెక్టర్లతో కలిసి 2021 ఫిబ్రవరిలో కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేస్‌లో అన్ని హంగులతో కార్యాలయం ఏర్పాటు చేశారని మొదటి వెంచర్‌గా హిల్టన్ జయ డైమెండ్ పేరుతో వెంచర్ ప్రారంభించినట్లు తెలిపారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ తమకు పదేపదే ఫోన్లు చేసి చందానగర్ లోని గోపనపల్లిలో తక్కువ ధరకు ప్లాట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారన్నారు. కార్యాలయానికి వెళ్లగా హంగు, ఆర్భాటాలతో పాటు దాదాపు వంద మందికి పైగా ఉద్యోగులు అక్కడ పని చేస్తున్నారన్నారు. సంస్థ ప్రతినిధుల మాటలు నమ్మి రూ. 20 లక్షల నుంచి రూ.1.80 కోట్ల వరకు పెట్టుబడి పెట్టామన్నారు. రెండేళ్లలో ప్లాట్లు అప్పగిస్తామని చెప్పారని. గడువు ముగిసిన తర్వాత అడిగితే నేడు రేపు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. దీంతో తమకు చూపించిన స్థలం వద్దకు వెళ్లి ఆరా తీయగా సదరు ప్రాజెక్టు వేరే సంస్థకు చెందినదిగా తెలుసుకుని నివ్వెరపోయామన్నారు. మధ్య తరగతికి చెందిన తాము పైసాపైసా కూడబెట్టుకుని ప్లాట్లు కోసం వెచ్చించామన్నారు. ఇదే సంస్థ గతంలో రాజమండ్రిలోనూ ఇదేతరహాలో మోసం చేసినట్లు తెలిసిందన్నారు. నిందితుడు కాకర్ల శ్రీనివాస్, మరో ఇద్దరు డైరెక్టర్లను పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రస్తుతం బెయిల్‌పై దర్జాగా తిరుగుతున్నారన్నారు. ఈ విషయమై పలు మార్లు పోలీసులకు, ఈడీ కార్యాలయంలో, మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు సంస్థ బాధితుల్లో రెండు రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారని ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ తీసుకుని నిందితులను అరెస్టు చేయాలని, వారి ఆస్తులను జప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

సనత్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను సనత్‌నగర్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భరత్‌నగర్‌కాలనీకి చెందిన గరక గణేష్ డిగ్రీ చదివాడు. ఓ మెడికల్ షాపులో పనిచేస్తున్న అతడికి జీతం ద్వారా వచ్చే డబ్బులు జల్సాలకు సరిపోవడం లేదు. తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలనుకున్నాడు. దీంతో తన స్నేహితుడు మూసాపేట అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వడ్ల పవన్‌తో జత కట్టాడు. పవన్ స్నేహితుడైన మధు గంజాయి అవసరమైన వారికి సరఫరా చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో గణేష్, పవన్ రెండు రోజుల క్రితం రూ.25 వేలు ఇచ్చి మధు నుంచి 1.5 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. వీరు మూసాపేట సంగీత మొబైల్స్ ఎదుట గంజాయి విక్రయిస్తున్నట్లుగా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. వారి నుంచి చిన్న చిన్న ప్యాకెట్లలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గత కొన్ని నెలలుగా గంజాయి దందా చేస్తున్న వీరు ఇప్పటివరకు 15 మందికి విక్రయించినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. నిందితులు గణేష్, పవన్‌లను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి 1.1 కిలోల గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సనత్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లై ఓవర్ పైనుంచి దూకి యువకుడి మృతి

గచ్చిబౌలి: భార్యతో గొడవ జరగడంతో మనస్తాపానికిలోనైన ఓ యువకుడు ఫ్లైఓవర్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా, అంబేడ్కర్‌నగర్‌కు చెందిన గొట్టివాడ చిన్నా అలియాస్ సూర్య(28) ఐదేళ్ల క్రితం ఒడిశాకు చెందిన రమ్యను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. మాదాపూర్‌లో ఉంటూ పెయింటర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతండటంతో వేర్వేరుగా ఉండేవారు. ఇటీవల కలిసిపోయిన వారు మళ్లీ ఒకే ఇంట్లో ఉంటున్నారు. కొద్ది రోజుల క్రితం భార్య తరుపు బంధువులు ఇంటికి రావడంతో మళ్లీ గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం భార్యతో గొడవపడిన సూర్య గచ్చిబౌలిలో ఉంటున్న తన సోదరి యమున ఇంటికి వెళ్లాడు. అతనుపలు మార్లు ఫోన్ చేసినా భార్య లిఫ్ట్ చేయలేదు. మధ్యాహ్నం సోదరి ఇంటి నుంచి బయటికి వచ్చిన అతను ‘నేను వెళ్లి పోతున్నా, మీరు జాగ్రత్తగా ఉండండి’ అంటూ అక్క, బావకు వాయిస్ మెసేజ్ పెట్టాడు. ఆ తర్వాత కొద్ది నిమిషాలకే కొత్తగూడ ఫ్లైఓవర్ పైకి ఎక్కిన అతను బొటానికల్ గార్డెన్ జంక్షన్‌లో కిందికి దూకాడు. తీవ్రంగా గాయపడిన అతడిని మసీద్‌బండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల కారణంగానే తన సోదరుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి సోదరి యమున ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోపాలమిత్రల గోస

- గతేడాది అక్టోబర్ నుంచి అందని వేతనాలు
- తీవ్ర ఇబ్బందులు
- చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



హస్నాబాద్‌లో పశువుకి గాలికుంటూ టీకా ఇస్తున్న గోపాలమిత్ర సిబ్బంది (ఫైల్)

కొడంగల్ రూరల్: చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గోపాలమిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పశువులకు వైద్య చికిత్సలు నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 2001లో ‘గోపాలమిత్ర’ పథకానికి శ్రీకారం చుట్టింది. పశు వైద్యశాలలకు దూరంగా ఉన్న గ్రామాల్లో పశువులకు వైద్య సేవలు(ప్రథమ చికిత్సలు మాదిరి) అందించేందుకు మండలంలో ఆసక్తి కలిగిన కొందరిని గోపాలమిత్రలుగా నియమించింది. సీజన్‌లలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వ్యాధి నిరోధక టీకాల సమయంలో గోపాలమిత్రలు వైద్యులకు సహాయకులుగా పనిచేస్తారు. 2009లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి గోపాలమిత్రల సేవలను గుర్తించి గౌరవ వేతనంగా రూ.2వేలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం వేతనాలు పెంచాలంటూ నిరసనలు వ్యక్తం చేస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా 2012లో రూ.3,500లకు పెంచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2019 నవంబర్ నుంచి రూ.8,500లకు పెంచారు. ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేస్తేనే జీతం అందుతుందని, 50శాతం పూర్తయితే రూ.5,500లు, 75శాతం పూర్తయితే రూ.6,500లు, 90శాతానికిపైగా టార్గెట్ పూర్తయితే రూ.8,500లు అందించారు. 2021లో పీఎఫ్‌తో కూడిన వేతనం రూ.11,050లను గోపాలమిత్రలకు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. రెగ్యులర్ అవుతుందనే ఆశతో చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విధులు ఇవీ..

పశువులు అనారోగ్యానికి గురయితే రైతులు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో గోపాలమిత్రలు చిన్న చిన్న వైద్య సేవలు అందిస్తూ వైద్య సిబ్బందికి విషయాన్ని తెలియజేస్తారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సీజన్‌లలో నిర్వహించే పశు వైద్య శిబిరాలలో ముఖ్య పాత్ర పోషిస్తారు. ప్రభుత్వ పశు వైద్య సిబ్బందితో కలిసి పశువులు, మేకలు, గొర్రెలు తదితర మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలను వేస్తారు. గోపాలమిత్రలు ఉన్న గ్రామాలతోపాటు పరిసర గ్రామాల్లోని పశువులకు కృత్రిమ గర్భధారణ(ఎద సూది) అందిస్తారు. సంకరజాతి, మేలుజాతి, జెర్సీ, ముర్రజాతి పశువుల అభివృద్ధికి కృషి చేస్తారు.

ప్రధాన డిమాండ్లు

పనికి సమానమైన వేతనం అందించాలని, ఇన్సూరెన్స్ భద్రత కల్పించాలని, అర్హులైన గోపాలమిత్రలను పశు సంవర్ధక శాఖలో అటెండర్లుగా, వీఏలుగా అవకాశం కల్పించాలని కోరుతున్నారు. గౌరవ వేతనం కుటుంబపోషణకు సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కనీస వేతనాలు అందించేందుకు ప్రభుత్వం కృషిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నెలనెలా ఇవ్వాలి

గతేడాది అక్టోబర్ నెల నుంచి వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గోపాలమిత్రలు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో పాడి పశువుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, క్రమం తప్పకుండా నెల నెలా వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలు తెరిచే సమయం కావడంతో తమ పిల్లలకు విద్యాభ్యాసం కోసం ఖర్చు ఉంటుందని, తమ వేదనను అర్థం చేసుకొని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పాడి అభివృద్ధికి కృషి



క్షేత్రస్థాయిలో పాడి అభివృద్ధికి కృషి చేస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలి. కనీస వేతనాలు, ప్రమాదబీమా, పశువైద్యశాలల్లో ఖాళీగా ఉన్న అటెండర్ పోస్టులను గోపాలమిత్రలతో భర్తీ చేస్తూ సర్కారు చర్యలు తీసుకోవాలి.

– రఘురామకృష్ణగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, గోపాలమిత్ర సంఘం

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



ఎన్నో ఏళ్లుగా గోపాలమిత్రగా పనిచేస్తూ చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వెటర్నరీ డిపార్ట్‌మెంటులో 8 వందలకు పైగా అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీనియర్లకు అవకాశం కల్పించాలి. కనీసవేతనం రూ.24వేలు అందించాలి.

– రవీందర్, రాష్ట్ర అధ్యక్షుడు, గోపాలమిత్ర సంఘం